కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 25, పచ్చిమిర్చి 60, బెండ 50, కాకర 60, దొండ 50, దోస 50, ఆలు 25, చామ 60, కీర 25, బీర 70, వంకాయ 50, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 50, ఉల్లి 40 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 250, వెల్లుల్లి 250.

డేటా ఎంట్రీ ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్ చేసే కార్యక్రమాన్ని జిన్నారంలో అధికారులు శనివారం ప్రారంభించారు. ఎంపీడీఓ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లు వారి విధులను మొదలు పెట్టారు.

గురుకుల ప్రవేశ పరీక్ష దరఖాస్తునకు 15వ తేదీ ఆఖరు

రాయదుర్గం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిభ కళాశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకొనే గడువు తేదీ ఈనెల 15 అని గౌలిదొడ్డి గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్ ఏ శారద తెలిపారు.2024–25 విద్యాసంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 38 సోషల్ వెల్ఫేర్ ప్రతిభ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ వంటి కోర్సులలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించడం జరుగుతుందన్నారు .ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జంట సర్కిళ్లలో 13,052 దరఖాస్తులు

శేరిలింగంపల్లి/ హఫీజ్‌పేట్: ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. జంట సర్కిళ్ళ పరిధిలో 13,052 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో చందానగర్ సర్కిల్‌లో 7,428 దరఖాస్తులు రాగా అందులో ఆరు గ్యారంటీ స్కీమ్‌ల కోసం 4,505 దరఖాస్తులు, ఇతర దరఖాస్తులు 2,923 దరఖాస్తులు వచ్చాయి. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో 5,624 దరఖాస్తులు రాగా అందులో 3,530 దరఖాస్తులు ఆరు గ్యారంటీ స్కీమ్‌ల కోసం కాగా, 2,094 దరఖాస్తులు ఇతర అంశాలపై వచ్చాయి.





పట్టాలు దాటుతూ..
ప్రమాదాల బారిన..

చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల అవస్థలు • లిఫ్టులు ఏర్పాటు చేయాలని వినతి


వాహనాలు ఎండలో పార్కింగ్ చేసిన దృశ్యం


రైల్వే స్టేషన్ ముందు పార్కింగ్ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు

హఫీజ్‌పేట్: చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. రైల్వే స్టేషన్ సమీపంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. పాపిరెడ్డి కాలనీ, చందానగర్ వైపు వెళ్ళాలంటే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులో ఉన్నా మెట్లు ఎక్కలేక ప్రజలు పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులుపడుతున్నారు. వాహనాల పార్కింగ్ స్థలంలో చెత్తాచెదారం వేస్తున్నారు. కుళాయిలు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. స్టేషన్ వద్ద ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్‌తో స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. స్టేషన్ ముందు ఉన్న బస్ షెల్టర్ పూర్తిగా శిధిలావస్థకు చేరింది.

సమస్యలు ఇవే..

- చందానగర్ రైల్వేస్టేషన్‌లో ఫ్లాట్‌ఫారాలకు వెళ్లాలంటే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఉంది. కానీ వృద్ధులు, మహిళలు, వికలాంగులు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారు.
- రైల్వే పట్టాల వద్ద బారికేడ్లు లేకపోవడంతో పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్న స్థానికులు
- రైల్వే స్టేషన్ రోడ్డు కంకర తేలడంతో ద్విచక్ర వాహనదారులు భయపడుతున్నారు.
- పార్కింగ్ స్థలంలో షెడ్డు లేకపోవడంతో ఎండలోనే వాహనాలు నిలుపుతున్నారు.
- ప్రధాన ద్వారం ముందు ఇష్టానుసారంగా ప్రైవేట్ వాహనాల పార్కింగ్
- బస్ షెల్టర్ ముందు చిరు వ్యాపారులు దుకాణాల ఏర్పాటుతో సమస్యలు
- రైల్వేస్టేషన్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది
- వాహనాల పార్కింగ్ స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయి అపరిశుభ్రంగా ఉంది
- కాగా బస్ షెల్టర్ ముందు దుకాణాలను తొలగించి బస్సులు, ఆటోలు నిలబడే విధంగా అధికారులు ఏర్పాటు చేయాలి. రోజు వాహనాల పార్కింగ్ స్థలంను శుభ్రం చేసేలా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో బాటు పార్కింగ్ స్థలంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్టేషన్‌లో లిఫ్టులు ఏర్పాటు చేయాలి



చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌లో ప్రతి రోజు వేలాదిమంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. ప్లాట్‌ఫారాలు మారాలంటే వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా లిఫ్టులు ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులకు వినతి పత్రం అందించాను. ఇప్పటికైనా అధికారులు రైల్వే స్టేషన్‌కుమరమ్మతులు చేయాలి.

– తాడిబోయిన రామస్వామి యాదవ్, మాజీ కౌన్సిలర్

పట్టాలు దాటకుండా చర్యలు తీసుకోవాలి



చందానగర్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారం దాటాలంటే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఉంది. కానీ పాపిరెడ్డి కాలనీ, చందానగర్‌వాసులు రైల్వే పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయాలలో రైలు పట్టాలపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రైల్వే అధికారులు పట్టాలు దాటకుండా చర్యలు తీసుకోవాలి.

– విజయ్‌కుమార్, పాపిరెడ్డి కాలనీ

9న భారతీయ భాషోత్సవం

రాయదుర్గం: మహాకవి సుబ్రహ్మణ్య భారతి జన్మదినోత్సవాన్ని భారతీయ భాషా దినోత్సవంగా ప్రతియేటా డిసెంబర్ 11న జరుపుకోవాలని భారత ప్రభుత్వం ప్రకటించిందని హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ డీన్ ఆచార్య వి కృష్ణ శనివారం తెలిపారు. హెచ్‌సీయూలో ఈనెల 9వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు.తెలుగు, ఉర్దూ, కన్నడ భాషల నుంచి నిష్ణాతులైన వారిచే ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.

కేలండర్ ఆవిష్కరణ


హెచ్‌యంటి హిల్స్ కాలనీ అసోసియేషన్ కేలండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గాంధీ తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: ఆంగ్ల నూతన సంవత్సరం 2024 సందర్భంగా హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌యంటిహిల్స్ కాలనీ అసోసియేషన్ వారి నూతన కేలండర్‌ను శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌యంటీహిల్స్ కాలనీ ప్రెసిడెంట్ కెఎస్ఆర్ మూర్తి, సెక్రటరి గోపిచంద్, ట్రెజరర్ ప్రసాద్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో జరగనున్న జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. శనివారం సోమేశ్వర ఆలయాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మూడు రోజులపాటు జరిగే జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఇంటింటికీ అక్షింతలు పంపిణీ



రాయదుర్గం: అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. గచ్చిబౌలి డివిజన్‌లోని టెలికామ్‌నగర్‌లో శనివారం స్థానిక సాయి దత్త గణపతి ఆలయంలో మొదట అక్షింతలకు పూజ చేశారు. అనంతరం వలంటీర్లు కాషాయ పతాకాలను ధరించి ఇంటింటికి వెళ్ళి అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. పంపిణీ చేసిన వారిలో స్థానిక నాయకులు రవీందర్‌రెడ్డి, దినేష్‌యాదవ్, సుభాష్ వెంకటేష్, వెంకట్ రావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

శోభాయాత్ర

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని ముంబై కాలనీ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం జరిగిన అయోధ్య శ్రీరాముని అక్షింతల వితరణ శోభయాత్రలో కార్పొరేటర్ సింధు ఆదర్శరెడ్డి పాల్గొన్నారు.అనంతరం ఆలయ నూతన కేలండర్‌ను ఆవిష్కరించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన గచ్చిబౌలి కార్పొరేటర్



రాయదుర్గం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కలిశారు. శనివారం నగరంలో ఆయన నివాసంలో కలిసి తన పుట్టినరోజు సందర్భంగా ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. గంగాధర్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి సీఎం అభినందించారు.

రేపటి నుంచి 'ప్రజావాణి'

హఫీజ్‌పేట్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజావాణి ప్రారంభం కానుందని ఉపకమిషనర్ వంశీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంటకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు తమ సమస్యలు తెలిపేందుకు నేరుగా సర్కిల్ కార్యాలయంకు వచ్చి నేరుగా వినతులు అందించవచ్చన్నారు.

గణేష్‌గడ్డ హుండీ లెక్కింపు

పటాన్‌చెరు టౌన్: రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని గణేష్‌గడ్డ దేవస్థానంలో శనివారం హుండీని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ రంగారావు సమక్షంలో లెక్కించారు. 56 రోజులకుగానూ రూ. 14 లక్షల 77 వేలు వచ్చాయని ఆలయ ఈఓ మోహన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్‌స్వామి ,చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్ ,ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

మియాపూర్: మియాపూర్‌లోని మయూరినగర్ కాలనీ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.


బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని భారతీయ విద్యా భవన్‌లో శనివారం నిర్వహించిన స్పోర్ట్స్‌డేలో విద్యార్థు గౌరవ వందనం స్వీకరిస్తున్న భవన్ కేంద్ర హైదరాబాద్ వైస్ చైర్మన్ గోపాలకృష్ణన్, ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఉమ. – సాక్షి సిటీ బ్యూరో

ఘనంగా మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ జన్మదిన వేడుకలు


వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్, ఇతర నాయకులు


గోపన్‌పల్లిలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే ఎం భిక్షపతియాదవ్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన 73వ జన్మదినాన్ని పురస్కరించుకొని మసీదుబండలోని ఆయన నివాసంలో సందడి నెలకొంది. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, డివిజన్ అధ్యక్షులు తదితరులు ఆయనను కలిసి శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భిక్షపతియాదవ్ మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులే తన ఎదుగుదలకు కారణమని, వారికి ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు.....

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కాలనీలవాసులు పాల్గొని ఆయనను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కేక్ కట్ చేశారు.

ఆకట్టుకున్న కథక్

మాదాపూర్: కళాకారులు కథక్ నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం డాక్టర్ చంద్రతప సహరాయ్ శిష్యబృందం కథక్ నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు. దీపిషా, శ్రీనిక, తనూజ, దీయ, విష్ణుప్రియ, వినయ, కేట్కి, ఆరోహి, ప్రీతి, సర్విహ్నా,



శరణ్య, కార్తీక, నైనికా, ఆద్య, ఆనికా, విశ్వద తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్‌లో అట్టహాసంగా క్రీడా పోటీలు


కొండాపూర్ బెటాలియన్‌లో పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు

గచ్చిబౌలి: ఉత్సాహంగా, ఉల్లాసంగా క్రీడాపోటీలు సాగాయి. కొండాపూర్‌లోని 8వ బెటాలియన్ ప్రాంగణంలో బి కంపెనీ వార్షిక రిఫ్రెషర్ కోర్సులో భాగంగా బెటాలియన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ కార్యక్రమాన్ని బెటాలియన్‌లోని కవాతు మైదానంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కమాండెంట్ సి సన్నీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీడాకారులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ వల్ల మానసిక ప్రశాంతత, దేహదారుఢ్యం పొందుతారన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ బి రామకృష్ణ, సహాయ కమాండెంట్ డి సత్యనారాయణ, కమాండర్ ఎస్‌వి ఆదినారాయణరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పనితీరు భేష్

మియాపూర్: మియాపూర్ డిపో ఆర్టీసీ ఉద్యోగులు మంచి పనితీరు కనబరుస్తున్నారని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అన్నారు. మియాపూర్ ఆర్టీసీ డిపో-2లో ఏర్పాటు చేసిన వనభోజన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగస్తులందరి భాగస్వామ్యంతోనే ఆర్టీసీ విజయపథంలో నడుస్తుందన్నారు. ఉద్యోగులు ఒత్తిడికి లోను కాకుండా పనిచేయాలన్నారు. అనంతరం డిపో పరిధిలో ఉత్తమ ఉద్యోగులకు బహుమతులను అందజే శారు. కార్యక్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వేణుగోపాల్ రెడ్డి, ఈడీలు


వన భోజనం చేస్తున్న ఎండీ సజ్జనార్

వెంకటేశ్వర్లు, ఆర్ఎం ఖాన్, డీఆర్ఎంఓ కవిత, డిపో మేనేజర్ శంకర్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ శనివారం చందానగర్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి కల్యాణం, పుష్పయాగం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రఘుపతిరెడ్డి, మాజీ కార్పొరేటర్ అశోక్‌గౌడ్, చందానగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్, వెంకటేష్, రామచంద్రరెడ్డి, సందీప్ రెడ్డి, మధుకర్, వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆలయ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మియాపూర్ డిపో-2 డీఎంగా వెంకటేశ్వర్లు

మియాపూర్: మియాపూర్ ఆర్టీసీ డిపో- 2 డీఎంగా వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఉన్న డీఎం శంకర్‌రావు మధిర డిపోకు వెళ్లగా వరంగల్-1 డిపో నుండి వెంకటేశ్వర్లు బదిలీపై వచ్చారు.

అన్నమయ్య స్వరార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా రామశర్మ వేణుగానం సందర్శకులను ఆకట్టుకుంది. ఇందులో వాతాపి గణపతిం భజే, ప్రభుం ప్రాణ నాదం, తిరుమల గిరి రాయ, శరణు శరణు కీర్తనలను వినిపించారు.

విద్యార్థులకు అల్పాహారం



హఫీజ్‌పేట్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టారని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రతి శనివారం మైహోం జ్యువెల్స్ అపార్ట్‌మెంట్స్ వాసులు ఏర్పాటు చేస్తున్న అల్పాహారం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులకు అల్పాహారం వడ్డించి వారితో ముచ్చటించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలలో సౌకర్యాలు ఉండేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్, ఐలాపూర్ తండాలో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరంను నిర్వహించినట్లు నిర్వాహకులు సాంబరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐలాపూర్, ఐలాపూర్ తండాలో మొత్తం 100 మందికి పైగా ఉచిత వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు.

ఓక్రిడ్జ్‌లో 'కాస్నివాల్'

పాల్గొన్న యాంకర్ సుమ కనకాల, వర్ధమాన నటుడు రోషన్ కనకాల

రాయదుర్గం: ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం 'కాస్నివాల్' నిర్వహించారు. స్టూడెంట్ యాక్టివిటీలో క్రియేటివ్, యాక్షన్ సర్వీస్(సీఏఎస్) కార్యక్రమం ద్వారా విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాలు, పెయింటింగ్, ప్రాజెక్టులను ప్రదర్శించారు.ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రముఖ యాంకర్ సుమ కనకాల, పూర్వ విద్యార్థి ,బబుల్‌గమ్ ఫేమ్ హీరో రోషన్‌కనకాల, హీరోయిన్ మానసాచౌదరి, ప్రిన్సిపల్ దీపికారావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం సుమ కనకాల మాట్లాడుతూ ఆసక్తిని అనుసరించి ఆ రంగంపై దృష్టిపెట్టాలన్నారు. ప్రిన్సిపల్ దీపికారావు మాట్లాడుతూ కాస్నివాల్ అనేదిసమాజానికి మద్దతుగా విద్యార్థులు నిలిచే విద్యార్థుల వార్షిక కార్యక్రమన్నారు.


కాస్నివాల్‌లో పాల్గొన్న సుమ కనకాల, రోషన్ కనకాల

ముగిసిన యువజనోత్సవాలు

మాదాపూర్: కళాకారులు సాంప్రదాయ నృత్యాలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామం సాంప్రదాయ వేదికలో రెండు రోజుల పాటు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలు శనివారంతో ముగిశాయి. 33 రాష్ట్రాల నుంచి 600 మంది కళాకారులు హాజరై వైవిధ్యభరితమైన నృత్యాంశాలను ప్రదర్శించి అలరించారు. ఈ ఉత్సవాలలో 70 మందిని ఎంపిక చేసి ఈనెల 12వ తేదీన మహారాష్ట్ర నాసిక్‌లో జరుగబోయే 27వ జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొననున్నారు. ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ యువజనుల శాఖ డైరెక్టర్, కమిషనర్


కళాకారులకు సర్టిఫికెట్‌లను అందజేస్తున్న డా.వెంకటేశ్వర్లు

డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రతిభ కనబరిచిన కళాకారులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీఎస్ స్టెప్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాలరావు, డిప్యూటి డైరెక్టర్ అనంత్‌రెడ్డి, జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో హామీలు అమలు చేయాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: కాంగ్రెస్ పార్టీ హామీలను సకాలంలో అమలు చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు.అమీన్‌పూర్ మండలం జానకంపేట గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ పాండు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ప్రొ.పూనంకుమారికి డాక్టరేట్

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పూనంకుమారికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించిందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పూనం కుమారి హిందీ విభాగంలో 'సమకాలీన్ దళిత్ రచనకా రోం కె కావ్య మే వ్యవస్థా కా విరోధ్ ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది ఆమెను సన్మానించి, అభినందనలు తెలిపారు.